జగనన్న సురక్షను సమర్ధంగా నిర్వహించండి

- రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : ఒకటి నుంచి ప్రారంభం కానున్న జగనన్న సురక్షను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని, సర్వే చేసే వారు (వలంటీర్లు,సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్సీపీ శ్రేణులు) సమర్ధంగా నిర్వహించాలని రెవెన్యూ శాఖామాత్యులు ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేశారు. నెల రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమానికి సంబంధించి అంతా బాగా పనిచేయాలని, ప్రశ్నలు అడిగి సమాధానాలు రాసేటప్పుడు వీటిని తూతూ మంత్రంగా నిర్వహించరాదని, ఆ విధంగా చేస్తే ఈ కార్యక్రమం లక్ష్యం నెరవేరదు అని విన్నవిస్తున్నాను. ఈ ప్రభుత్వం తీసుకు వచ్చిన వాటిలో అనేక కార్యక్రమాల్లో ఇదొక మంచి కార్యక్రమం. నిస్సహాయులుగా ఉండిపోయి అర్హత ఉన్నా పథకాలు అందని వారికి అందించే కార్యక్రమం ఇది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఈ విధంగా చేయడం ఇదే మొదటి సారి. సరైన పాత్ర నిర్వహించాం అన్న తృప్తి మీకు మిగలాలి. మీతో కలిసి పనిచేస్తున్న అధికారులు, సేవకులు విని అర్థం చేసుకుని, అర్థం కాకపోతే మరోసారి అడిగి తెలుసుకుని ప్రశ్నావళిని పూర్తి చేయండి. గృహాలను సందర్శించేటప్పుడు పూర్తి సమయం వెచ్చించండి. మీకు అనుబంధంగా కన్వీనర్లు ఉంటారు. దీనిని తూతూ మంత్రంగా చేయకండి. అలానే ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. కనుక దీనిని సమర్ధంగా నిర్వహించి ప్రభుత్వానికి మరింత గౌరవం తీసుకుని రండి. మంచి పేరు తీసుకుని రావడానికి ఓ భాగమై పనిచేయాలని, మీరు కూడా సంతృప్తి పొందే విధంగా ఈ కార్యక్రమ నిర్వహణను భావించాలని నేను కోరుకుంటున్నాను." అని ఆయన పేర్కొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దు

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం

విశాలాంధ్ర-శ్రీకాకుళం : అంగన్వాడి కేంద్రాల సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే బాలల హక్కుల ఉల్లంఘనకు పాల్పడినట్లే నని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. శుక్రవారం శ్రీకాకుళం జిల్లా పర్యటనలో ఉన్న ఆయన పట్టణంలోని పొందర వీధిలోని అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు, రికార్డులు పరిశీలించారు. తక్కువ బరువు గల పిల్లల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు, కోడి గుడ్లు బరువుపైన, బియ్యం, బాలామృతం పేకెట్లును పరిశీలించారు. అక్కడే ఉన్న ఐసిడిఎస్ ప్రోజెక్ట్ డైరెక్టర్ జయదేవి, సిడిపిఒ శోభల నుండి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ అంగన్వాడీ కేంద్రాలపై వచ్చే ఫిర్యాదులను కమిషన్ చైర్ పర్సన్ అప్పారావు నేతృత్వంలో ప్రత్యేక దృష్టితో పరిశీలన జరుపుతున్నామని అన్నారు,పౌష్టికాహార లోపం ఏర్పడకూడదనే సంకల్పంతో ప్రభుత్వాలు ఏర్పరిచిన ఈ అంగన్వాడీ కేంద్రాల్లో శత శాతం బాలల వెన్నంటే ఉంటూ వారి హక్కుల ఉల్లంఘనకు పాల్పడకుండా సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కే.శ్రీనివాస్, ఎం.వాసుదేవ కుమార్, అంగన్వాడి కేంద్రాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మఒడి పథకం విద్యార్థులకు వరం : ఎమ్మెల్సీ నర్తు

విశాలాంధ్ర-కవిటి : అమ్మఒడి పథకం విద్యార్థులకు వరమని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమ్మ ఒడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమన్నారు. అందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం అమ్మఒడి, నాడు-నేడు, వసతి దీవెన, విద్యా దీవెన, గోరుముద్ద వంటి అనేక కార్యక్రమాలను అమలుచేస్తోందన్నారు. విద్యార్థులు చదువులో రాణించి రాష్ట్ర ప్రతిష్టను పెంచాలన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని బడికి వంపి చదివించాలన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వం పాఠశాలను ఆధునీకరించడంవల్ల మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చాయన్నారు. వాటిని వినియోగించుకుని విద్యాభివృద్ధి సాధించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్, ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్, స్థానిక సర్పంచ్ సనపల జానకిరావు, ఏఎంసి వైస్‌చైర్మన్ నీలయ్య, ఎంఈఓ ధనుంజయ మజ్జి, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందజేయాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని లండారిపుట్టుగ సచివాలయంలో జగనన్న సురక్ష శిక్షణ కార్యక్రమం పై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ ఈ శిక్షణలో భాగంగా మిగిలి ఉన్న అర్హులైన లబ్ధిదారులను గుర్తించి సంక్షేమ ఫలాలు అందించ వలసిందిగా తెలియజేశారు. జగనన్న సురక్ష క్యాంప్ లో 11 రకాల సర్టిఫికెట్లు జారిచేయబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్,స్వచ్ఛభరత్ డైరెక్టర్ కృష్ణ రౌలో, సచివాలయ కన్వీనర్స్, గృహసారదులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

కపాసుకుద్ది గ్రామంలో.... మండలంలోని కపాసుకుద్ది గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం గ్రామ సచివాలయం పరిధిలో అవగాహన సదస్సు కవిటి ఎంపీడీవో పీ సూర్యనారాయణ రెడ్డ ఆధ్వర్యంలో నిర్వహించారు. వాలంటీర్లకి,గృహసారథులకు, కన్వీనర్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కాయ దమయంతి,ఎంపీటీసీ సభ్యులు తడక పార్వతి, మండల వైయస్సార్సీపి నాయకులు కాయ భీమసేన్,పులకల శ్రీరాములు,తడక సత్యం,జెసిస్ కన్వీనర్ జల్లు యుగంధర్,, పాతిన వెంకటరావు,ఎంఎల్‌ఓ అశోక్, సచివాలయ కన్వీనర్స్,గృహసారథులు, పంచాయతీ కార్యదర్శి,సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ మహమ్మారికి మరో వ్యక్తి బలి

విశాలాంధ్ర-కవిటి : కవిటి ఉద్దానం ప్రాంతంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న కిడ్నీ మహమ్మారి మరణాలకు ఇప్పటికీ అంతు లేకుండా పోతుంది. మరణ మృదంగం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ మండలం కవిటి మేజర్ పంచాయతీ పరిధి రామయ్యపుట్టుగ గ్రామంలో మరిడి చలపతి (48) శుక్రవారం ఉదయం కిడ్నీ వ్యాధితో బాధ పడుతూ ప్రాణాలు విడిచాడు. సుమారు పదేళ్ల క్రితం కిడ్నీ వ్యాధి బారిన పడి అప్పటి నుంచి ప్రైవేటు వైద్యాన్ని ఆశ్రయించి విపరీతంగా వైద్యం కోసం పెట్టుబడులు పెట్టి చివరకు ప్రభుత్వ డయాలసిస్ కేంద్రంలో రెండేళ్లుగా డయాలసిస్ సేవలు పొందుతూ చివరకు తుది శ్వాస విడిచాడు. వ్యాధి బారిన పడిన నుంచి శారీరక శ్రమకు నోచుకోలేక ఉపాధి అవకాశాలు లేక కుటుంబాన్ని పోషించుకోలేక పేదరికంలో మగ్గుతున్న ఈ కుటుంబానికి కనీసం ధైర్యం నింపే యజమాని కూడా లేకుండా పోయాడు. ఇటువంటి పరిస్థితులు ఉద్దానంను అనేక ఏళ్ల తరబడి పట్టి పీడిస్తున్నప్పటికి ప్రభుత్వాలు నామ మాత్రపు వైద్యంతో చేతులు దులుపుకుంటున్నాయంటూ ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. మృతుడు చలపతిరావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మహిళలు లోను కోసం బ్యాంకుల చుట్టూ తిరగొద్దు

డిసిసిబి మేనేజర్ సంధ్యారాణి

విశాలాంధ్ర-ఆముదాలవలస : రైతు మహిళా స్వయం శక్తి సంఘాలకు సభ్యుల అవసరం మేరకు వారి పొదుపు ఖాతా నుంచి అప్పులు ఇచ్చుకోవడానికి బ్యాంకు పని దినాలలో ఎప్పుడైనా విత్‌డ్రా చేసుకోవడానికి అవకాశం కల్పిస్తూ అవసరమైనలోను మంజూరు కోసం మా బ్యాంకు చుట్టూ మహిళలు తిరగకుండా మా సిబ్బందితో మేమే గ్రామానికి వచ్చి మంజూరు చేస్తున్నట్లు డిసిసిబి బ్యాంకు మేనేజర్ డి సంధ్యారాణి తెలిపారు. శుక్రవారం స్థానిక బ్రాంచ్ పరిధిలో ఏ.పి.ఎం. పైడి కూర్మారావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సి.బి.ఆర్.ఎమ్. సమావేశం లో పాల్గొని మాట్లాడారు. మూడు లక్షల లోపు రుణాలపై కేవలం ఏడు శాతం వడ్డీతో, మరియు మూడు లక్షలు పైబడిన రుణాలపై కేవలం 9 శాతం వడ్డీకే మహిళ లకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. ఇతర బ్యాంకులతో పోల్చు కుంటే ప్రాసెసింగ్ చార్జీలు గాని ,ఇన్స్పెక్షన్ చార్జీలు గాని, మెయింటెనెన్స్ చార్జీలు గాని వసూలు చేయడం లేదని వివరించారు .మా బ్యాంకులో రుణం తీసుకున్న సంఘానికి ఇతర బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న వారి సంఘాలకు తేడాను వివరించారు. రుణాలు తీసుకోవడానికి మా బ్యాంకు చుట్టూ తిప్పుకోకుండా మా సిబ్బందిని గ్రామాలకు పంపించి సర్వీసును అందిస్తున్నట్లు వివరించారు. వీధి వ్యాపారస్తులకు జగనన్న తోడు , జగనన్న కాలనీ ఇల్లు నిర్మించు కుంటు న్నవారికి హౌసింగ్ రుణాలు, వైయస్సార్ చేయూత, ఆసరా లబ్ధిదారులకు ఆదా యాభివృద్ధి కార్యక్రమాల కొరకు రుణాలు తక్కువ వడ్డీకే మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణారావు తో పాటు క్లస్టర్ కోఆర్డి నేటర్లు రామప్పుడు, రమణ, చంద్రరావు, ఉమా లక్ష్మీ తో పాటు వి.వో. ఏ.లు ప్రశాంతి, జయలక్ష్మి, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

39 మందికి నియామక పత్రాలు అందజేత

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : ఎచ్చెర్ల నియోజకవర్గంలో డిగ్రీ బీఎస్సి కెమిస్ట్రీకి సంబంధించి అర్హులైన 39 మందికి నియామక పత్రాలు అందజేసిన ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, జిల్లా కలెక్టర్ బాలాజీ లాఠకర్. ఎచ్చెర్ల నియోజకవర్గం పైడిభీమవరం రెడ్డీస్ కంపెనీలో ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఇటీవల జరిగిన బిఎస్సి కెమిస్ట్రీ ఇంటర్వ్యూలో అర్హత సాధించిన 39మందికి నియామక పత్రాలు అందజేసిన ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, జిల్లా కలెక్టర్ శ్రీ బాలాజీ లాఠకర్. ఈ కార్యక్రమంలో రణస్థలం మండలం ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, జే.సి.యస్ ఇంచార్జ్ చిల్ల వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ ప్రతినిధి మైలపల్లి కామరాజు, పైడిభీమవరం పంచాయతీ ఎంపీటీసీలు ఆకల శ్రీనువాసరావు, మునకాల దుర్గారావు, వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు లంకలపల్లి గోపి, రెడ్డి రామకృష్ణ, రెడ్డీస్ కంపెనీ ప్రతినిధులు రాజు, దీపక్, జోగారావు, వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మండల జేసీఎస్ ఇన్‌ఛార్జ్‌గా కరుణాకర్

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : మండల జగనన్న సచివాలయం కన్వీనర్ ఇన్‌ఛార్జ్‌గా డోకులపాడు గ్రామానికి చెందిన వడ్డి కరుణాకర్ ను నియమిస్తూ వైసీపీ కేంద్ర కార్యాలయం నుండి ఉత్తర్వులు వచ్చినట్లు వైసీపీ మండల అధ్యక్షుడు పి.గురయ్యనాయుడు తెలిపారు. జెసిఎస్ ఇన్‌చార్జ్‌గా నియామకంపట్ల వడ్డి కరుణాకర్ ధన్యవాదములు తెలిపారు. వైసీపీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ సిఎం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. ఇందుకు కృషి చేసిన రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం చేయాలి

డీఎల్‌పిఓ ఐవి రమణ

విశాలాంధ్ర-కవిటి : నేటి నుంచి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం చేయాలని టెక్కలి డీఎల్‌పిఓ ఐవి రమణ కోరారు. ఈమేరకు శుక్రవారం మండలంలోని కవిటి పంచాయతీ కార్యాలయం ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక చెత్తతో సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఈఓపిఆర్డి శివాజీ పాణిగ్రహి, ఈవో వీరభద్ర స్వామి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ నిర్మాణానికి ఎంపీపీ శంకుస్థాపన



విశాలాంధ్ర-సోంపేట : ఈ మండలం చేపల గొల్లగండి గ్రామంలో బస్‌షెల్టర్ నిర్మాణానికి ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు శుక్రవారం భూమిపూజ చేసి శంకుస్థాపన నిర్వహించారు. గ్రామస్తులు, సర్పంచ్ నాగం భాస్కరరావు, ఎంపీటీసీ మద్దు ఈశ్వరరావు తదితరుల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహించారు. బస్‌షెల్టర్ నిర్మాణం త్వరలో పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వస్తుందని ఎంపీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో బైపల్లి తిరుపతి, ఎర్ర మాధవరావు, అమర లోకనాథం, నిట్ట మాధవరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోరుభద్రలో పారిశుధ్య కార్యక్రమం



విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం బోరుభద్రలో శుక్రవారం పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ బుసకల లక్ష్మీకాంతం, ఆధ్వర్యంలో స్మశాన వాటికలో ఉన్న చెత్తను పొక్లెయిన్ తో తొలగించి వేసే కార్యక్రమం చేయించారు. సంతబొమ్మాళి మండలం పంచాయతీ విస్తరణ అధికారి హనుమంతు శశిభూషణరావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయతీ కార్యదర్శి వినోద్, బుసకాల లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

విద్యుత్ ఛార్జీలను తగ్గించకుంటే ప్రజా ఉద్యమాలు

- గతంలో వాడుకున్న విద్యుత్తుకు ఇప్పుడు చార్జీలు విధించడం విడ్డూరం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ రూపంలో ప్రజలను దోచుకుంటున్నాయి
- జిల్లా విద్యుత్ కార్యాలయం ముందు ధర్నాను నిర్వహించిన వామపక్ష పార్టీలు

విశాలాంధ్ర-గార/ శ్రీకాకుళం : విద్యుత్ చార్జీలు పెంపుదలకు వ్యతిరేకంగా ప్రజల మద్దతుతో ఉద్యమాలు ఉధృతం చేస్తా మని సిపిఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గోవిందరావు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాషరావులు హెచ్చరించారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఏపీఈపిడీసీయల్ ఎస్‌సి కార్యాలయంవద్ద శుక్రవారం వామపక్షాల నిర్వ హించిన ధర్నాను ఉద్దేశించి వారు మాట్లాడారు. బిజెపి, వైసీపీ ప్రభుత్వాలు కరెంటు భారాలను ప్రజల నెత్తిమీద వేసి తీవ్ర దోపిడీకి గురిచేస్తున్నయని ఆరోపించారు. స్థిర చార్జీలు, ట్రూ ఆఫ్ చార్జీలు, కస్టమర్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జిల పేరుతో విద్యుత్ వినియోగదారున్ని నిలువునా మోసం చేస్తున్నాయని విమర్శించారు. 2014 నుండి 2019 సంవత్సరాల మధ్యలో వాడుకున్న కరెంటుకు, మళ్లీ ఇప్పుడు చార్జీలను వసూలు చేసి, వినియోగదారులను దోచుకుంటున్నారని, ఇది తీవ్రమైన అన్యాయమన్నారు. ప్రపంచం మొత్తం మీద కరెంటు చార్జీలు తగ్గాయని, గతంలో సోలార్ విద్యుత్ యూనిట్కు రూ. 12, ఉండగా ఇప్పుడు ఉత్పత్తి ఖర్చు తగ్గి కేవలం రూ.2లకు పడిపోయిన తరుణంలో తక్షణమే కరెంట్ చార్జీలు తగ్గించాలని వారు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ రంగాన్ని ఆదానితో పాటు ఇతర కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. స్మార్ట్ మేటర్ల పేరుతో ప్రతి విద్యుత్ కనెక్షన్కు రూ.13వేల భారం వేసి 10 సంవత్సరాలపాటు, ప్రతి నెల రూ.150 చొప్పున అదనంగా భారాలు వేసి సదరు కంపెనీల విద్యుత్ దోపిడీకి, ప్రభుత్వాల పెద్దలే మార్గం సుగమనం చేస్తున్నారని విమర్శించారు.

రాజకీయ నాయకులు, కార్పొరేటర్లు కుమ్మక్కై యూనిట్ విద్యుత్తును రూ.2 లకు కొనవలసిన దగ్గర 10 నుండి రూ.12లకు కొంటున్నారని ఆరోపించారు. దీంతో నిబంధనలకు విరుద్ధంగా హిందుజా కంపెనీకి రూ.1200 కోట్లు అప్పనంగా చెల్లించారని తెలిపారు. ట్రూ ఆఫ్ ఛార్జీలు రద్దు చేయాలని, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని , 100 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగం ఉచితంగా ఇవ్వాలని, విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ ఆపాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చాపర వెంకటరమణ, సిపిఐ టౌన్ సహాయ కార్యదర్శి కొమర భాస్కరరావు,సిపిఐ సీనియర్ నాయకులు చిక్కాల గోవిందరావు, సీపీఐ జిల్లా సమితి సభ్యులు నిమ్మాడ కృష్ణమూర్తి, సీపీఐ సభ్యులు నజీర్, సీపీఎం నాయకులు జి సింహాచలం, అల్లు మహాలక్ష్మి, టి తిరుపతిరావు, ఎన్వి రమణ, పొందూరు చందరరావు, అల్లు సత్యనారాయణ, శ్రీదేవి,పాణిగ్రహి,ఎన్ నీలం రాజు,డి భాస్కరరావు ,ఎం కృష్ణ,యల్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏఈకి వామపక్ష పార్టీలు వినతిపత్రం సమర్పణ

పాతపట్నంలో : ప్రజలపై విద్యుత్ బారాలు వేయరాదని 2020 విద్యుత్ సంస్కరణల బిల్లును తిర స్కరించి ముందస్తు బిల్లులు చెల్లించే ప్రతిపాదన విర మించుకోవాలని వామపక్ష పార్టీలు సిపిఐ సిపిఎం పార్టీలు కలసి శుక్రవారం పాతపట్నం ఎలక్ట్రికల్ ఏఈని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం అదనపు రుణాల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన విద్యుత్ సంస్కరణలు అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించరాదని రైతులపై పెను భారంగా మారే షరతులను తిరస్కరించాలని అన్నారు. ఈ షరతుల వల్ల ఇప్పటివరకు ఉచిత రాయితీ విద్యుత్తు పొందుతున్న రైతులు ఇతర పేదలు విద్యుత్ బిల్లును ముందుగానే చెల్లించాల్సి ఉంటుంది. కావున స్మార్ట్ మీటర్లు తిరస్కరించా లన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకట్రావు, వామపక్ష నాయకులు ప్రసాదరావు, కనకాల శ్రీను, కే.సూర్య రావు, అత్తిలి ఆదినారాయణ, పి.చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

పలాసలో : పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పలాస విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వ హించారు. అనంతరం విద్యుత్ డి.ఇ జి.ప్రసాద రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వామపక్షాల నాయకులు ఎన్.గణపతి, వంకల మాధవరావు, సి.హెచ్. వేణుగోపాల్ మాట్లాడుతూ ట్రూ అప్ చార్జీలు, సర్ చార్జీల పేరుతో ప్రజలపై భారాలు వేయడం దుర్మార్గమని అన్నారు. మోడికి తలొగ్గి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబంపై ఏడాదికి 13వేల రూపాయలు అదనపు భారం వేస్తుందని అన్నారు. ప్రభుత్వం చెల్లించాల్సిన సబ్సిడీని ప్రజలపై భారం మోపడం సరైన పద్ధతి కాదని, కార్పొరేట్ల లాభాల కోసం స్మార్ట్ మీటర్లు పెట్టడం ప్రభుత్వానికి తగదని అన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే మరో విద్యుత్ ఉద్యమం తప్పదని అన్నారు. కార్యక్రమంలో వి.కృష్ణారావు, ఎ.వీరాస్వామి, బి.కూర్మారావు, ఎం.తాతయ్య, సి.హెచ్.రవి, జె.భాగ్యలక్ష్మీ, ఎం.పరుశురాం, వి.ముకుందరావు, రైతు సంఘం నాయకులు కె.బాలాజీరావు, సిఐటియు నాయకులు టి.సింహాద్రి, డి.కామేష్‌లు పాల్గొన్నారు.

ఎర్రన్న విద్యా సంకల్పానికి విశేష స్పందన

ఎంపీ రామ్మోహన్‌నాయుడు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : స్థానిక ఎంపీ రామ్మోహన్ నాయుడు నిర్వహిస్తున్న ఎర్రన్న విద్యా సంకల్పం కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటికే దాదాపు 9,000కు పైగా రిజిస్ట్రేషన్లు పూర్తి అయ్యి జులై 2వ తారీఖున పరీక్ష నిర్వహించడానికి ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఎంపీ ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం విద్యల నిలయంగా మార్చడమే నాన్న ఎర్రన్నాయుడు ప్రగాఢ కోరిక, అందుకు అనుగుణంగా ఆయన ఆశయసాధన కోసం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించానని తెలిపారు. గత నాలుగేళ్లుగా ఎంతోమంది నిరుద్యోగులు పరీక్షల కోసం ఎదురుచూస్తూ మారిన సిలబస్‌కు అనుగుణంగా పుస్తకాలను కొనలేకపోతున్నారని గ్రహించి నాన్న ఆశయ సాధన కొరకు, శ్రీకాకుళం నిరుద్యోగ యువత కు నావంతు సహాయం అందించాలని ఈ కార్యక్రమాన్ని సంకల్పించి ఆచరణలో పెట్టాలంటే నిష్ణాతులు, విద్యా వంతులు కావాలి అని మదిలో తట్టగానే విద్యావ్యవస్థలో ఎంతో అనుభవం కలిగిన తెలుగుదేశం పార్టీ ఉత్తరాంధ్రుల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎకానమీ ప్రొఫెసర్ వేపాడ చిరంజీవిరావుకు చెప్పడంతో ఆయన తన అనుభవాన్ని మొత్తం ఉపయోగించి ఈ కార్యక్రమాన్ని రూపొందించి సిలబస్ నుండి క్వశ్చన్ పేపర్ తయారీ వరకు ఈ కార్యక్రమం కోసం ఎంతో శ్రమించి ఆయన వంతు సహాయం చేశారన్నారు. కోటబొమ్మాళిలో జూన్ 10న మొదలుపెట్టిన ఈకార్యక్రమానికి దాదాపు మొదటి దశలో 5,000కు పైగా రిజిస్ట్రేషన్ లు నమోదు అయ్యాయి అని, ఇంకా ఎంతో మంది యువతీ యువకుల కోరిక మేరకు రిజిస్ట్రేషన్ గడువును జూన్ 25 వరకు పొడిగించడం జరిగిందన్నారు. చివరి 5 రోజుల్లో దాదాపు 4,000 మందికి పైగా రిజిస్ట్రేషన్లు పూర్తి కావడం ప్రజల అశేష స్పందనకు తార్కాణం అన్నారు. శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలో ప్రతి నియోజకవర్గంలో మొదటి మూడు స్థానాలు సాధించిన యువతకు ఒక్కొక్కరికి రూ. 10వేలు స్కాలర్‌షిప్, మొదటి 100 స్థానాలు సాధించిన యువతకు ఉచితంగా పుస్తకాలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా డీఎస్సీ, గ్రూప్-1,2, పోలీసు పరీక్షలకు సన్నాహమవుతున్న నిరుద్యోగ యువత పాల్గొంటారని, ఈ పరీక్ష జులై 2న ఆదివారం ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు శ్రీకాకుళంలో గురజాడ కళాశాల, ఎస్ఆర్ కళాశాల, శివాని ఇంజనీరింగ్ కళాశాల, వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నారు. టెక్కలిలో ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల మరియు పలాసలో శ్రీ గురుకుల పాఠశాల, శ్రీ గురుకుల జూనియర్ కాలేజ్, విద్యా వాహిని కళాశాల, మదర్ థెరెసా పాఠశాలల్లో జరుగుతాయి అని తెలిపారు. ఇప్పటికే హాల్ టిక్కెట్లను మెయిల్ ద్వారా, వాట్సాప్ ద్వారా సందేశాలను జిల్లాలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారందరికీ పంపించామని, ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో దాదాపు 1450 మంది నిరుద్యోగ యువత డీఎస్సీ పరీక్ష ను, 2,470 మంది పోలీసు కు సంబదించిన పరీక్ష ను, 5000 మందికి పైగా నిరుద్యోగ యువత గ్రూప్ -1, గ్రూప్- 2 పరీక్షను వ్రాయనున్నారని, పరీక్షకు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరీక్షకు సంబంధించి ఎటువంటి సందేహాలు ఉన్నా 9030555251, 9347435842 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని కోరారు. పరీక్షకు దూర ప్రాంతాల నుండి వచ్చే వారు క్షేమంగా వచ్చి, దిగ్విజయంగా పరీక్షరాసి, క్షేమంగా వెళ్ళాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

విశాలాంధ్ర పాతపట్నం : జిల్లా ఎస్పీ జి.ఆర్. రాధిక ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల పోలీసులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా పాతపట్నంలోని పలు షాపుల్లో సిఐ వినోద్‌బాబు తన సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మత్తు పదార్థాలకు సంబంధించిన ఏవిధమైన రవాణా, విక్రయాలు చేయకూడదని షాపు యజమానులకు సూచించారు. మత్తు పదార్థాలు, నిషేధిత గుట్కా, గంజాయి రవాణా, విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధితోనే సర్కార్ జన నేస్తమైంది : స్పీకర్ తమ్మినేని

విశాలాంధ్ర-పొందూరు : గత నాలుగేళ్ల నుండి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ సంక్షేమ పథకాలకు పెద్ద పీట వేసి రాష్ట్ర సమగ్రాబివృద్ధితోనే సర్కారు జననేతమైందని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. శుక్రవారం పొందూరు మండలం కొంచాడా పంచాయతీ పరిధిలో చిన్న కొంచాడా యాగాటిపేట లొట్టా పేట గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని వైయస్సార్ మండలపార్టీ నాయకత్వంలో అధికారుల సమక్షమున నిర్వహించారు. ముందుగా సుమారు 11 లక్షల నిధులతో యాగాడిపేట మరియు లొట్టపేట గ్రామాలకు జల జీవన మిషన్ ద్వారా ఇంటింటికి మంచినీటి కళాయిల కార్యక్రమాన్ని శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి,సంక్షేమం, దేశానికే ఆదర్శంగా నిలిచిందని, దేశానికి పట్టుకొమ్మల లాంటి గ్రామీణ ప్రాంతాల మౌలిక వసతుల కల్పనలోకృషి దేశానికి ఆదర్శవంతంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యులు లోలు కాంతారావు పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి మండల పార్టీ అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్ పొందూరు టౌన్ పార్టీ అధ్యక్షులు గారు నాగరాజు మార్కెట్ కమిటీ చైర్మన్ బారాన సునీల్ కుమార్, వైస్ ఎంపీపీ వందాన వెంకట్రావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కిరాణా సూర్యారావు స్థానిక సర్పంచ్ పి అనురాధ,స్థానిక నేతలు కాళ్ళకూరి బాబురావు, ఢిల్లీ, పి.రామినాయుడు, తవిటి నాయుడు,వైయస్సార్సీపి సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వైద్యాధికారి అవనిపై మండిపడ్డ ప్రజాప్రతినిధులు

విధులకు హాజరుకావడం లేదంటూ ప్రశ్నించిన వైనం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈమండలం బోరుభద్ర వైద్యాధికారి డాక్టర్ అవనిపై ప్రజా ప్రతినిధులు మండిపడ్డారు శుక్రవారం సంతబొమ్మాళి ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశంలో విధులకు హాజరు కావటం లేదని అంశంపై ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీ ప్రతినిధి, సర్పంచ్ ప్రతినిధి చింతాడ చిన్నారావు, సురాడ వెంకటేష్ మండిపడ్డారు. విధులుకు కొడుతున్నారు అంటూ, ప్రశ్నించిన సందర్భంలో డాక్టర్ అవని నా విధులు గురించి నీకెందుకు, నా విధులు విషయంలో నీకేం తెలుసు అని తిరిగి ప్రశ్నించడంతో సమావేశం నుంచి బయటికి వచ్చిన తర్వాత ప్రజా ప్రతినిధులతో వైద్యాధికారి వాగ్వేదానికి దిగాడని వారు ఆరోపించారు. దీంతో వాగ్వాదం చోటుచేసుకుంది అక్కడే ఉన్న దండు గోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, ఫార్మసిస్ట్ సుబ్రమణ్యం వైద్యాధికారిని సర్ది చెప్పి తీసుకెళ్లిపోయారు.

పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవు

సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర-మెలియాపుట్టి : పనితీరు మార్చుకోకుంటే బాధ్యులపై చర్యలు తప్పవని టెక్కలి డివిజన్ సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. మెలియాపుట్టి తహసిల్దార్ ఆశ్రమం సందర్శించి అక్కడ పరిస్థితులపై టెక్కలి సబ్ కలెక్టర్ వారికి నివేదించడంతో దీనిపై ఆయన మెలియాపుట్టి మండలం, పెద్దలక్ష్మీపురంలో గల గిరిజన ఆశ్రమ పాఠశాలను శుక్రవారం నాడు ఆయన ఆకస్మిక సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా మెనూ చార్టును పరిశీలన చేసి విద్యార్థులకు అందించే మెనూ అమలుతీరును చూసి అసహనాన్ని వ్యక్తపరిచారు. అనంతరం విద్యార్థుల వద్ద నుండి భోజనాలను గూర్చి ఆరా తీయగా మెనూ సక్రమంగా అమలు చేయడం లేదని విద్యార్థులు తెలియజేయడంతో ప్రభుత్వం మెనూ అమలు కొరకు అధిక మొత్తంలో నిధులు వెచ్చిస్తున్నప్పటికీ ఎందుకు అమలు చేయడం లేదని సబ్ కలెక్టర్ ప్రశ్నించారు. తర్వాత విద్యార్థులు ఉపయోగించే బాత్ రూమ్‌లను సైతం చూసి వాటిని పరిశుభ్రం చేయకపోవడంతో ప్రధానోపాధ్యాయుడు, వార్డెన్‌ల పనితీరు పై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కనీసం మౌలిక వసతుల కల్పనలో సైతం సిబ్బంది విఫలం చెందారని తక్షణమే సంబంధిత అధికారుల దృష్టిలోపెట్టి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని, వివరనివ్వాలని ఆదేశించారు. అదేవిధంగా సోమవారం ఏటిడబ్ల్యూతో కలసి మీ ఇరువురు తన కార్యాలయానికి రావాలన్నారు. అలాగే వాటర్ ప్లాంట్‌ను పరిశీలనచేసి నీటిని సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ ద్వారా నమూనా తీసుకొని పరిశీలన చేయమన్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్‌తోపాటు తహశీల్దారు సరోజిని, ఎంపీపీ ప్రతినిధి, స్థానిక సర్పంచ్ ఉదయ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.